క్లుప్తంగా

ఉపాధ్యాయుడికి యువమంథన్ పత్రం



యువమంథన్ సర్టిఫికెట్


చంద్రశేఖర్‌రెడ్డి

చేజర్ల (సోమశిల): అనంతసాగరం మండలం చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న చల్లా చంద్రశేఖర్ రెడ్డికి కేంద్ర యువమంథన్ సర్టిఫికెట్ లభించింది. జీ 20 ఓరియంటేషన్ మాడ్యూల్ పూర్తి చేసిన నేపథ్యంలో యువమంథన్ డైరెక్టర్ నితిన్‌అగర్వాల్ నుంచి సర్టిఫికెట్ అందినట్లు శనివారం ఆయన తెలిపారు. 21వ శతాబ్దంలో నైపుణాల ఆవశ్యకత, 2020 నూతన జాతీయ విద్యావిధానం, భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వైరీత్యాలు అరికట్టడం, శాంతి నిర్మాణం, యుద్ధం లేని యుగానికి నాంది, సుస్థిర జీవనం తదితర అంశాలు ఉన్నాయన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి

అనుమసముద్రంపేట: ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన వాతావరణాన్ని సృష్టించేందుకు తమ వంతు బాధ్యతగా రెండు మొక్కలు నాటి సంరక్షించాలని ఏఎస్‌పేట ఎంపీపీ బోయిళ్ల పద్మజారెడ్డి అన్నారు. శనివారం ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయంలో నా భూమి నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. మాతృభూమి రుణం ఆహ్లాదకరమైన వాతావరణాన్ని పెంపొందించేందుకు మా వంతు చెట్లు నాటి మేము నడిచిన నేల రుణం తీర్చుకుందామంటూ నినాదాలు చేశారు. అనంతరం దేశ ప్రధాని నరేంద్రమోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశాలతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షేక్ తాజున్నిసా, ఎంపీడీఓ భాస్కర్‌రావు, పలు పంచాయతీల కార్యదర్శులు, హెడ్స్ స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు, ఉపాధి హామీ మహిళలు పలువురు నేతలు పాల్గొన్నారు.

జగనన్న గృహ నిర్మాణాలకు భూమి పూజ


జగనన్న ఇళ్లకు భూమి పూజ చేస్తున్న ఎంపీపీ

చేజర్ల: మండలంలోని మడపల్లిలో జగనన్న గృహ నిర్మాణాలకు ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ శనివారం భూమి పూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ జగనన్న కాలనీలు రాబోయే రోజుల్లో ఆదర్శ గ్రామాలుగా, టౌన్‌షిప్‌లుగా తయారవుతాయన్నారు. త్వరగా గృహ నిర్మాణాలు పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేసే విధంగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.ప్రకాశ్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ వెంకటరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రసాద్‌రెడ్డి మధుసూదన్‌రెడ్డి, వసంత, నాగేంద్రరెడ్డి, ఆనంద్‌రెడ్డి, పుల్లయ్య, సుధీర్‌రెడ్డి, బాలయ్య, రసూల్ పాల్గొన్నారు.

గ్రంథాలయ శాస్త్రసిద్ధాంతకర్త రంగనాథన్ జయంతి


ఆత్మకూరు లైబ్రేరిలో రంగనాథన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లైబ్రేరియన్లు తదితరులు

ఆత్మకూరు: గ్రంథాలయ శాస్త్ర సిద్ధాంతకర్త డాక్టర్ ఎస్ఆర్ రంగనాథన్ జయంతి కార్యక్రమాన్ని స్థానిక గ్రంథాయంలో శనివారం నిర్వహించారు. తొలుత రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆత్మకూరు గ్రంథాలయం అధికారి ఓంకారం రాజు మాట్లాడుతూ రంగనాథన్ గ్రంథాలయ శాస్త్రంలో కోలన్ క్లాసిఫికేషన్, పంచ సూత్రాలు రూపొందించారన్నారు. ఈ సందర్భంగా విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల లైబ్రేరియన్లు, తెలుగుభారతి సేవా సమితి సభ్యులు ఎస్వీ రమణయ్య, డి నారాయణరావు, కేవీ శేషారెడ్డి, టీసీవీ సుబ్బయ్య, నరసింహారెడ్డి, వెలిశెట్టి నారాయణరావు, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముంగిట్లో పాలన

గత ప్రభుత్వ పాలన వరకు గ్రామాల్లో కనీసం పంచాయతీ భవనాలకే దిక్కులేదు. పంచాయతీల్లో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండేవారు కాదు. రెవెన్యూ, మండల పరిషత్ పరంగా ఏ చిన్న అవసరం వచ్చినా.. మండల కేంద్రాలకు పరుగులు తీయాల్సిన దుస్థితి. రోజుల తరబడి తిరిగితే కానీ ఆ పనులు పూర్తయ్యేవి కావు. సంక్షేమ పథకాలు పొందాలంటే ప్రభుత్వం నుంచి నిర్దిష్ట సంఖ్యలో కేటాయించేవారు. వీటికి కోసం టీడీపీ జన్మభూమి కమిటీల సిఫార్సుల మేరకే మంజూరయ్యేవి. ఇదంతా టీడీపీ పాలన.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి పంచాయతీలో రూ.40 లక్షల వ్యయంతో ఆధునిక వసతులతో సచివాలయ భవనాలు శరవేగంగా నిర్మించారు. వివిధ విభాగాలకు ఉద్యోగులను నియమించారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సైతం అక్కడే ఉండే విధంగా చర్యలు చేపట్టారు. వీరితో పాటు వలంటీర్లను నియమించి ఏ లబ్ధిదారుడు కనీసం సచివాలయానికి కూడా రావాల్సిన అవసరం లేకుండా కావాల్సిన పత్రాలు తీసుకుని ధ్రువీకరణ పత్రాల నుంచి సంక్షేమ పథకాల వరకు నేరుగా ఇంటి వద్దకే తీసుకువచ్చి అందజేస్తున్నారు. మండల కేంద్రాలకే కాకుండా డివిజన్ కేంద్రాలకు వెళ్లి పొందే సేవలను సైతం సచివాలయాల్లోనే అందిస్తున్నారు.



జలదంకి మండలం జమ్మలపాలెం సచివాలయం

మండలం	సచివాలయాలు	ఉద్యోగులు	వలంటీర్లు
జలదంకి:	13	105	253
ఉదయగిరి	12	109	195
వరికుంటపాడు	12	106	158
సీతారామపురం	9	80	133
కలిగిరి	14	128	229
కొండాపురం	13	114	215
దుత్తలూరు	11	92	131
వింజమూరు	11	104	204



- సచివాలయాలతో గ్రామ స్వరాజ్యం
- సచివాలయాల్లో 512 రకాల సేవలు
- కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్, దర్శనాలకు ఆన్‌లైన్ సేవలు
- గ్రామీణులకు తప్పిన వ్యయ ప్రయాసలు

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లె ముంగిట్లోకే ప్రభుత్వ పాలన, సేవలను తీసుకువచ్చి గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్య పాలనను సాకారం చేశారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఎనలేని ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. ఏ సమస్యకైనా నిర్దిష్ట వ్యవధిలో పరిష్కారం చూపేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. ఉన్న ఊర్లోనే అన్ని సేవలు అందుతుండడంతో మండల కేంద్రాలకు వెళ్లే బాధలు తప్పాయని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే 512 రకాల సేవలు అందిస్తున్న గ్రామ సచివాలయాల్లో తాజాగా డ్రైవింగ్ లైసెన్స్, టీటీడీతో పాటు ప్రముఖ ఆలయాల్లో దర్శనాలకు ఆన్‌లైన్ సేవలు, ఆస్తుల క్రయవిక్రయాల రిజిస్ట్రేషన్లను అందిస్తున్నారు. సచివాలయాల్లో కొన్ని సేవలు ఉచితం, మరి కొన్నింటికి నిర్దిష్ట రుసుం రూ. 15 చెల్లింపుతో అందిస్తున్నారు. ఆధార్, ఈకేవైసీ, కుల ధ్రువీకరణ పత్రం, 1బీ అడంగళ్, విద్యుత్ కనెక్షన్ కోసం ఆన్‌లైన్లో నమోదు చేయడం, ఓటరు నమోదు, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్, బస్‌పాస్ వంటి వాటికి మీ సేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాయకుండా సచివాలయాల్లోనే జారీ చేసే విధానాన్ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ప్రతి గ్రామంలో సచివాలయ ఏర్పాటుకు ప్రభుత్వం రూ. 40 లక్షలు వెచ్చించి నిర్మాణం చేపట్టింది.

అందుబాటులో సేవలు

ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వ శాఖల్లో సర్టిఫికెట్లు తీసుకునేందుకు మీ సేవ కేంద్రాలు, ఇంటర్నెట్ కేంద్రాలకు వెళ్లే వాళ్లు. ప్రస్తుతం రెవెన్యూ, పంచాయతీ, పోలీస్, వైద్యం, విద్యుత్, వ్యవసాయం, రవాణా, హౌసింగ్, విద్య, క్రీడలు, ఉపాధి పనులకు జాబ్‌కార్డులు ఇలా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో అన్ని శాఖలకు చెందిన 512 సేవలకు సచివాలయాల్లోనే పనులు అవుతున్నాయి.

మండల కార్యాలయాలకు స్వస్తి

సచివాలయ వ్యవస్థ రాక ముందు ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మండల, తాలుకా, జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లి పరిష్కరించుకునేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పడ్డాక గ్రామాల్లోనే పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ప్రభుత్వం అందించే నవరత్నాల పథకాలతో పాటు పింఛన్లు, పక్కాగృహాలు, రైతు సమస్యలు, విద్యాదీవెన వంటి ఎన్నో సంక్షేమ పథకాలకు సంబంధించి సొంత గ్రామంలోనే దరఖాస్తు చేసుకుంటూ నేరుగా లబ్ధి పొందుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో 8 మండలాల్లో 95 సచివాలయాల పరిధిలో 838 మంది సచివాలయాల సిబ్బంది, 1,518 మంది వలంటీర్లు ప్రజలకు సేవలు అందిస్తున్నారు.


కమ్మవారిపాలెం సచివాలయం

అన్ని రకాల సేవలు సచివాలయంలోనే..



అన్ని గ్రామ సచివాలయాల్లో ప్రభుత్వ సేవలు అందుబాటులో ఉన్నాయి. ఎలాంటి సర్టిఫికెట్ కావాలన్నా సచివాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రతి నిత్యం సచివాలయాలను తనిఖీ చేస్తూ సిబ్బందికి సూచనలు అందిస్తున్నాం. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తున్నాం.

– శ్రీధర్‌బాబు, ఎంపీడీఓ, జలదంకి

నిజమైన గ్రామ స్వరాజ్యపాలన



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం. సచివాలయాల ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా పల్లెల్లోని లబ్ధిదారులకు అందుతున్నాయి. ప్రజల ఇళ్ల వద్దకే పాలన తీసుకువచ్చిన సీఎంకు ప్రతి ఒక్కరూ రుణపడి ఉంటాం. వలంటీర్లు ప్రతి ఇంటికీ వచ్చి పథకాలు అందిస్తున్నారు.

– మేకల శ్రీనాథ్‌రెడ్డి, బ్రాహ్మణక్రాక

ఇంటి స్థలం మంజూరు

మా గ్రామంలో సచివాలయం ఏర్పడడం వల్ల ప్రభుత్వ పరంగా ఇంటి స్థలం పొందాం. గతంలో ఇవి అందాలంటే ఎన్నో తిప్పలు పడేవాళ్లం. నా భార్యకు జగన్ సీఎం అయినప్పటి నుంచి అమ్మఒడి అందుతోంది. సచివాలయాల్లో ఏ పనులు కావాలన్నా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నాం.

– నారే సురేష్, బ్రాహ్మణక్రాక, బీసీ కాలనీ



రాష్ట్రానికి శాశ్వత సీఎం జగనన్నే

- 90 శాతం మంది ప్రజల అభిప్రాయం
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


సంక్షేమ పథకాల లబ్ధిదారుల కుటుంబానికి బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన వినూత్నమైన సంక్షేమ పథకాలతో పాటు తరతరాలుగా హక్కులు లేని భూములను సాగు చేసుకుంటున్న పేదలకు భూ హక్కులు కల్పిస్తూ సామాజికంగా, ఆర్థికంగా పేదల అభ్యున్నతికి పాటు పడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే ఈ రాష్ట్రానికి శాశ్వత ముఖ్యమంత్రిగా ఉండాలని 90 శాతం మంది ప్రజలు కోరుకుంటున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని 23వ వార్డులో ఎమ్మెల్యే శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి ఎమ్మెల్యే వెళ్లి గడిచిన నాలుగేళ్ల కాలంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు అందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమ పథకాల కోసం, ప్రజా అవసరాల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా వారికి కావాల్సిన సేవలు ఇంటి వద్దకే అందించే రీతిలో పరిపాలన చేపడుతున్నారన్నారు. ప్రజల అవసరాలు తీర్చడంలో ప్రభుత్వ చిత్తశుద్ధికి ప్రజల నుంచి సానుకూల స్పందన పెరిగిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో దాదాపు 60 లక్షలకు పైగా దొంగఓట్లను చేర్పించారనే ఆరోపణలు ఉన్నాయని, వాటిని గుర్తించి తొలగించే విధంగా ప్రజాస్వామ్య పద్ధతిలో చర్యలు తీసుకుంటామన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అన్ని విధాలా సత్తా ఉన్న నాయకుడు వైఎస్ జగన్ మాత్రమే అనే విషయాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. వైఎస్సార్ ఆసరా పెన్షన్ అందుకుంటున్న అవ్వా, తాతలు, సంక్షేమ పథకాలు అందుకుంటున్న అక్క, చెల్లెమ్మలు, ప్రతి ఒక్కరూ కూడా 'మా భవిష్యత్ నువ్వే జగనన్న' అంటున్నారని ఎమ్మెలే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఏపీ ప్రజలంతా 'రావాలి జగన్ మళ్లీ కావాలి జగన్' అంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఈ.కిరణ్, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు, జనిగర్ల మహేంద్రయాదవ్, చెన్ను ప్రసాద్ రెడ్డి, పందిటి కామరాజు, కనుపర్తి రాజశేఖర్, గంధం ప్రసన్నాంజనేయులు, నెల్లూరు వెంకటేశ్వరరెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, కాటా శ్రీనివాసులురెడ్డి, ఈతముక్కల చంద్రశేఖర్ రెడ్డి, కుందుర్తి కామయ్య, మండలి కృష్ణారావు, గుర్రం వెంకటేశ్వర్లు, అమరా వేదగిరి, తిరువీధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నిర్ధారణకు ఫీవర్ సర్వే


మురుగు నిల్వలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి హుస్సేనీ

ఆత్మకూరురూరల్: జిల్లా వ్యాప్తంగా కీటకజనిక వ్యాధులతో పాటు డెంగీ జ్వరాలను నిర్ధారణకు 50వ ఫీవర్ సర్వే చేపట్టామని జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనీ తెలిపారు. మర్రిపాడులోని తిక్కవరం రోడ్డులో నివాస గృహాల్లో ఉన్న బాత్ రూముల సమీపంలో మురుగు నిల్వలను శనివారం ఆమె గమనించారు. ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్1 యాంటిజన్ కిట్‌లు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో ఉంచామని, వీటి ద్వారా జ్వరాల సంబంధమైన పరీక్షలు నిర్వహించేందుకు వీలవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇళ్లలోని నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉంటే పలు రకాల కీటకాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. కనీసం వారానికి రెండు సార్లు నీటి నిల్వలను తొలగించి ఆరబెట్టాలన్నారు. తద్వారా మలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు తదితర వ్యాధుల బారిన పడకుండా రక్షించబడవచ్చన్నారు. దీంతో పాటుగా సాయంత్రం 6 గంటల కల్లా ఇళ్లలోని కిటికీలు, కర్టన్లు, డోర్లు మూసివేయడం ద్వారా ఇళ్లల్లోకి దోమలు రాకుండా నిరోధించవచ్చన్నారు. దోమతెరలు, శరీరాన్ని పూర్తిగా కప్పి ఉంచే పలుచటి వస్త్రాలు ధరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్ఎం రమణమ్మ, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణానికి సిమెంట్ రోడ్ల సొబగులు

- రూ.60 లక్షలతో వివిధ ప్రాంతాల్లో నిర్మాణం
- మండల పరిషత్ పాలకవర్గం నిర్ణయం
- ఇప్పటికే పనులు ప్రారంభం


వింజమూరులో హిందూనగర్ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

వింజమూరు (ఉదయగిరి): సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పనులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. స్థానిక సంస్థల నిధులతో ప్రధాన వీధుల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపట్టింది. వింజమూరు మండల పరిషత్ నిధులతో వివిధ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్డు వేసేందుకు ఇటీవల పాలకవర్గం అమోదం తెలిపింది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల్లో అంతర్గతంగా సిమెంట్ రోడ్లు నిర్మాణం పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఆయా ప్రాంతాల్లో వర్షా కాలంలో బురదతో ఇబ్బంది పడుతున్న స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వింజమూరు మండల పరిషత్ పాలక వర్గం కొలువు దీరి రెండేళ్ల అయింది. అప్పటి నుంచి ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసింది. అయితే రాజకీయ కారణాలతో ఆ నిధులు ఖర్చు చేయలేదు. అయితే ఇటీవల జరిగిన పాలకవర్గం సమావేశంలో వివిధ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్లు వేసేందుకు ఆమోదం తీసుకున్నారు. వింజమూరు మెయిన్ రోడ్డు నుంచి హిందూనగర్‌లో అంతర్గత సిమెంట్ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణం కోసం రూ.25 లక్షలు కేటాయించారు. దీంతో ఈ ప్రాంత వాసులు పదేళ్లుగా వర్షా కాలంలో పడుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ సమస్యలు తీరనున్నాయి. ఈ ప్రాంతంలో ప్రముఖ ప్రైవేట్ వైద్యశాలతో పాటు, విద్యాసంస్థలు ఉండడంతో నిత్యం అధిక సంఖ్యలో ప్రజల రాకపోకలు సాగుతున్నాయి. వర్షా కాలంలో ఈ రోడ్డు మార్గంలో ప్రయాణం నరకయాతనగా ఉండేది. ఈ ఇబ్బందులు త్వరలో తీరనున్నాయి. వింజమూరులోని గంగమిట్టలో సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు, పాతూరు నుంచి బైపాస్‌రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి మరో రూ.4 లక్షలు కేటాయించారు. యర్రపాళెంలో ఖాసీం పెద్దిరెడ్డి ఇంటి నుంచి శివకోటారెడ్డి వరకు సీసీ రోడ్డుకు రూ.4 లక్షలు కేటాయించారు. తక్కెళ్లపాడు ఎస్సీ కాలనీలో రూ.4 లక్షలు, నల్లగొండ్ల ఎస్టీ కాలనీ రోడ్డుకు రూ.4 లక్షలతో సిమెంట్ రోడ్లు వేస్తారు. చాకలికొండలో సీసీ రోడ్డుకు రూ.5 లక్షలు, వింజమూరు పాతూరులో డ్రైనేజీ నిర్మాణం కోసం మరో రూ.4 లక్షలు కేటాయించారు.

త్వరలో పనులు ప్రారంభం

మండల పరిషత్ నిధులతో వివిధ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు పాలకవర్గం ఆమోదం తెలిపింది. త్వరలో ఆయా ప్రాంతాల్లో పనులు ప్రారంభిస్తారు. దీంతో ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉన్న సమస్యలు తీరనున్నాయి. త్వరలో మండల పరిషత్‌కు వచ్చే నిధులతో పాలకవర్గ ఆమోదంతో అవసరమైన చోట్ల అభివృద్ధి పనులు చేపడతాం.

– రాజేష్‌బాబు, ఎంపీడీఓ

సిద్ధులకోనలో మేకపాటి రాజారెడ్డి పూజలు


సిద్ధులకోనలో శివలింగానికి పూజలు నిర్వహిస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం చాబోలు అటవీ ప్రాంతంలోని చాబోలు పాయలో ఉన్న సిద్ధులకోనలో శనివారం ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్ రెడ్డి పురాతన శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. చాబోలు గ్రామానికి ఐదు కి.మీ.కుపైగా దూరంలో దట్టమైన అరణ్యంలో ఉన్న శివలింగం వద్దకు పార్టీ నాయకులతో కలిసి చేరుకుని శివలింగానికి విశేష అభిషేకాలు నిర్వహించి పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు దుగ్గిరెడ్డి కృష్ణ ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు చెన్ను శ్రీధర్‌రెడ్డి, ఓంకారం శివకుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్ర ధనస్సు తనిఖీ




ఆత్మకూరు: మిషన్ ఇంద్ర ధనస్సు ద్వారా అందుతున్న సేవలను నమోదు చేస్తున్న రికార్డులను అర్బన్ పీహెచ్‌సీ మెడికల్ అధికారి ఎస్‌కే అస్మ శనివారం తనిఖీ చేశారు. మున్సిపల్ పరిధిలోని అరుంధతీయవాడలో మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా డబ్ల్యూహెచ్ఓ టీమ్ గర్భిణులకు, చిన్నారులకు ఇచ్చిన వ్యాక్సినేషన్, వాటిని నమోదు చేసిన రికార్డులు, ఎంసీపీ కార్డులు ఇంటింటికి తిరిగి పరిశీలించారు. సక్రమంగా వ్యాక్సినేషన్ వేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డబ్ల్యూహెచ్ఓ అధికారి మధుసూదన్, సూపర్‌వైజర్లు లలితమ్మ, సుధాకర్, ఖాజా, ఏఎన్ఎం పద్మ, రాజేశ్వరి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

జలాశయంలో యథేచ్ఛగా చేపల వేట


చేపలు పట్టేందుకు వలలు సిద్ధం చేస్తున్న జాలర్లు

చేజర్ల (సోమశిల): కొన్ని రోజులుగా సోమశిల జలాశయంలో యథేచ్ఛగా చేపల వేట కొనసాగుతోంది. మత్స్య సంపద వృద్ధి నేపథ్యంలో మత్స్యశాఖ అధికారులు సోమశిల జలాశయంలో రెండు నెలల పాటు వేట విరామం ప్రకటించారు. జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు జలాశయంలో ఎవరూ చేపల పట్టరాదని అధికారులు విధించిన నిషేధాజ్ఞలను కొంత మంది జాలర్లు, వ్యాపారులు పట్టించుకోకుండా వేటను యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అర్ధరాత్రి వేళ జాలర్లు జలాశయం వెనుక ప్రాంతాల్లో వేటను కొనసాగిస్తున్నారు. నిషేధం అమలవుతున్న సమయంలో జాలర్లు వలలు, పడవలతో జలాశయంలో తిరగకూడదు. దీనికి భిన్నంగా జలాశయం పరిసర ప్రాంతాల్లో యథేచ్ఛగా తిరుగుతున్నారు. జలాశయం వెనుక ప్రాంతాల నుంచి చేపలను వేటాడి గోతాల్లో గుట్టు చప్పుడు కాకుండా తీసుకువస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ చేపలను నేరుగా వ్యాపారులు సుదూర ప్రాంతాలను తరలిస్తున్నారు. మత్స్యశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినవస్తున్నాయి. ప్రస్తుతం మత్స్య సంపద వృద్ధి చెందుతున్న సమయంలో నిషేధాజ్ఞలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.


జలాశయంలోకి పడవల్లో వెళ్తున్న జాలర్లు

నేడు రాజగోపాల్‌రెడ్డి రాక

దుత్తలూరు: ఆదివారం దుత్తలూరులో జరిగే సొసైటీ అధ్యక్షుల ప్రమాణ స్వీకారం, కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి హాజరు కానున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని కమ్మవారిపాళెం, నందిపాడు సొసైటీ ఛైర్మన్లు, సొసైటీ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం ఆదివారం ఉదయం 10 గంటలకు దుత్తలూరు సొసైటీ ప్రాంగణంలో జరుగుతుందని, కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు

చేజర్ల: మండలంలోని నాగులవెలటూరులో కొలువై ఉన్న వెంకయ్యస్వామి మందిరంలో 37వ ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఉదయం అభిషేకం, సాయంత్రం పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు మహా నైవేద్యం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రికి వెంకయ్యస్వామికి గ్రామోత్సవం నిర్వహిస్తామని మందిర కమిటీ ఛైర్మన్ వేలూరు కేశవచౌదరి తెలిపారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.